

డీఎస్సీ అభ్యర్థులకు కాల్‌లెటర్స్

నరసన్నపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మెగా డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు సోమవారం కాల్‌లెటర్లు పంపించారు. జిల్లాలో 543 ఉపాధ్యాయ పోస్టులకుగాను జడ్పీ ఆధ్వర్యంలో 407 పోస్టులు, మునిసిపాలిటీ పరిధిలో 51 పోస్టులు, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 85 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇటీవల డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఎంపిక ప్రక్రియను నిర్వహించి, తుది జాబితాను విడుదల చేశారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు (మిగతా 6వ పేజీలో..)

లక్ష్యాలను చేరుకోవాలి ప్రగతి సాధించాలి



సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు

- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశం
- కొన్ని రంగాలకు రాష్ట్రస్థాయిలో ర్యాంకుల కేటాయింపు
- జిల్లాకు బి-గ్రేడ్ గుర్తింపు

శ్రీకాకుళం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): లక్ష్యాలను చేరుకుని.. శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. అమరావతిలో సోమవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో నివేదికల ఆధారంగా ముఖ్యమంత్రి ప్రసంగించారు. జిల్లా అభివృద్ధికి అవసరమైన సహకారం.. తక్షణం తీసుకోవాల్సిన చర్యలు.. ప్రగతి సాధించాల్సిన రంగాలపై కలెక్టర్‌తో మాట్లాడి పలు సూచనలు చేశారు. జిల్లా స్థూల ఉత్పత్తి.. లక్ష్యం.. ఇంకా సాధించాల్సింది.. ప్రతిభ చూపాల్సిన శాఖలపై నివేదికలను వెల్లడించి పలు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో పలు అంశాలకు సంబంధించి జిల్లాలవారీగా ర్యాంకింగ్‌లను కేటాయించారు. రాష్ట్రంలో జిల్లా పనితీరు ఆధారంగా మొత్తం 62పాయింట్లు లభించాయి. జిల్లాను 'బి-గ్రేడ్'గా గుర్తించారు. ఇక జిల్లాకు పరిశ్రమల విభాగంలో 68 పాయింట్లు సాధించి 'బి గ్రేడ్', వ్యవసాయ రంగంలో 28 పాయింట్లు సాధించి 'సి గ్రేడ్' లభించింది. 'శ్రీకాకుళం జిల్లా పరిశ్రమలు, చేపల పెంపకం, పశుసంవర్థక రంగాల్లో మంచి పురోగతి సాధించింది. వ్యవసాయంలో ఇంకా వృద్ధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సరైన ప్రణాళిక, నిల్వ సదుపాయాలు, సమయానికి గణాంకాలు నమోదు చేస్తే ఈ సంవత్సరం లక్ష్యాలను చేరుకోవచ్చు' అని సీఎం సూచించారు.

● **ప్రధాన సవాళ్లు :** పంటల ఉత్పత్తి వివరాలు సమయానికి నమోదు (మిగతా 6వ పేజీలో..)



సదస్సులో పాల్గొన్న మంత్రి అచ్చెన్న, కలెక్టర్ స్వప్నిల్

సేవా రంగం...

లక్ష్యం:	రూ. 23,071 కోట్లు
మొదటి త్రైమాసికంలో సాధించింది:	రూ. 5,421 కోట్లు (23.5 శాతం)

జిల్లా మొత్తం ఉత్పత్తి (జిల్లా స్థూల ఉత్పత్తి)

ఈ ఏడాది లక్ష్యం:	రూ.49,088 కోట్లు
మొదటి త్రైమాసిక (ఏప్రిల్-జూన్)లో సాధించినది:	రూ.11,880 కోట్లు
సాధించిన శాతం:	24.2 శాతం
మిగిలిన మూడు త్రైమాసికాల్లో సాధించాల్సింది:	రూ. 37,208 కోట్లు

వ్యవసాయం.. అనుబంధ రంగాలు..

మొత్తం వ్యవసాయం:	రూ. 13,399 కోట్లు
మొదటి త్రైమాసికం సాధన:	రూ. 2,354 కోట్లు (17.6 శాతం)
ఇంకా పూర్తిచేయాల్సినది:	రూ. 11,045 కోట్లు

పశుసంవర్థక వివరాలు


పాల ఉత్పత్తి:	2,964 మెట్రిక్ టన్నులు
కోళ్ల సంఖ్య:	24 లక్షలకు పైగా
పశువుల సంఖ్య:	సుమారు 2,200
గొర్రెలు, మేకలు:	సుమారు 5,700

చేపల పెంపకం...

గతేడాది చేపల విలువ:	రూ. 4,347 కోట్లు
ఈ ఏడాది వృద్ధి లక్ష్యం:	సుమారు 18 శాతం
ప్రధానంగా రొయ్యలు, సముద్ర చేపలు, చెరువుల్లో చేపల ఉత్పత్తి	

పరిశ్రమలు

లక్ష్యం	రూ. 8,594 కోట్లు
తొలి త్రైమాసికంలో సాధించినది	రూ. 3,234 కోట్లు (37.6 శాతం)



బారువ బీచ్

సువిశాల తీరం..

పర్యాటకం లేదాయె!

"● జిల్లాను పర్యాటక హబ్‌గా మారుస్తాం. బారువ బీచ్‌ను మినీ గోవాగా తీర్చదిద్దుతాం. ఏటా బీచ్ ఫెస్టివల్ నిర్వహించి తీర ప్రాంత అందాలను బాహ్య ప్రపంచానికి చూపుతాం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలో తీర ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతాలుగా తీర్చిద్దుతాం.

- ఇదీ ఈ ఏడాది ఏప్రిల్ 20న బారువ బీచ్ ఫెస్టివల్‌లో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రకటన"

- ఒడిశాతో పోల్చుకుంటే వెనుకబాటు
- జిల్లాలోని బీచ్‌ల్లో కానరాని వసతులు
- పర్యాటకులకు తప్పని అవస్థలు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటకాభివృద్ధికి అడుగులు పడడం లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో(2014-2019 మధ్య) పర్యాటక రంగానికి ప్రాధాన్యమిచ్చారు. జిల్లాకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టారు. కాగా.. వైసీపీ హయాంలో పర్యాటక రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. కూటమి అధికారంలోకి రావడంతో పర్యాటకం ఊపందుకుంటుందని అంతా భావించారు. కానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. జిల్లాలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తే స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. కానీ కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో పర్యాటకులకు అవస్థలు తప్పడం లేదు.

● ఇదీ పరిస్థితి...

జిల్లాలో ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి రణస్థలం మండలం దోనిపేట వరకూ 193 కిలోమీటర్ల మేర తీరం విస్తరించి ఉంది. డొంకూరు, కవిటి, బారువ, అక్కుపల్లి, భావనపాడు, కళింగపట్నం, మొగదాలపాడు, కళ్లేపల్లి, గనగళ్లపేట, బందరువానిపేట తదితర తీరప్రాంతాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి అవసరమైన వనరులు ఉన్నాయి. జిల్లా సరిహద్దున ఒడిశా రాష్ట్రంలో ఉన్న సోనాపూర్ బీచ్‌కు ఏమాత్రం తగ్గని విధంగా ఇక్కడ బీచ్‌లను ఎంతో అభివృద్ధి చేయవచ్చు. అలాగే తీరప్రాంతంలో కొబ్బరి, జీడీ, ఇతర ఉద్యాన పంటలు కనువిందు చేస్తాయి. జిల్లాలో బాహుదా, (మిగతా 6వ పేజీలో..)

● **బాధాకరం**

పేరుకే బీచ్‌లు. కానీ అక్కడ వసతులు లేవు. కేవలం సముద్రం చూసి రావడానికి అన్నట్టు ఉంటుంది పరిస్థితి. కనీసం తీరంలో బెంచ్‌ల ఏర్పాటు కూడా లేదు. అదే పక్కనే ఒడిశాలోని సోనాపూర్ బీచ్ చూస్తే కళ్లు చెదిరిపోతాయి. మన బీచ్‌లపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టాలి.


- చాట్ల లోహిదాస్‌రెడ్డి, ఇచ్ఛాపురం

● **అక్కడ బీచ్‌లే బెస్ట్..**

కుటుంబంతో బీచ్‌కు వెళితే చక్కగా కూర్చోవడానికి వీలు లేకుండా పోతోంది. ఎండకు, వర్షానికి తలదాచుకుంటామంటే చెట్లే గతి అవుతున్నాయి. అందుకే జిల్లా నుంచి ప్రజలు సేద తీరేందుకు ఒడిశాలో బీచ్‌లకు వెళుతున్నారు. అక్కడ ఆహ్లాదకరమైతే వాతావరణం.. కూర్చోవడానికి వసతులు ఉన్నాయి. జిల్లాలో ఏబీచ్‌లోనూ ఆ పరిస్థితి లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బీచ్‌లను అభివృద్ధి చేయాలి.

- కాళ్ల నరసింహమూర్తి, ఇచ్ఛాపురం

వ్యాపారులకు గుడ్డు



- రిటైల్ మార్కెట్‌లో ఒక్కోటి రూ.7
- రైతుకు దక్కేది రూ.4.90 మాత్రమే
- ఆందోళనలో కోళ్లఫారాల నిర్వాహకులు

రణస్థలం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కోడిగుడ్ల ధరల విషయంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. కోళ్లఫారం నిర్వహించే రైతుల కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కడం లేదు. కానీ రిటైల్ మార్కెట్లో మాత్రం ధర భారీగా ఉంది. కోళ్లఫారం నిర్వాహకుల వద్ద ఒక్కో గుడ్డు రూ.4.90 చొప్పున కొనుగోలు చేసి.. రిటైల్ మార్కెట్‌లో రూ.7చొప్పున విక్రయిస్తున్నారు. దీంతో నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. కోడిగుడ్ల ధర తగ్గడంతో కోళ్లఫారాల నిర్వహణ కష్టమేనని వాపోతున్నారు. జిల్లాలో ఎచ్చెర్ల నియోజకవర్గంలో పౌల్ట్రీ రైతులు ఉన్నారు. గుడ్లు ఉత్పత్తి చేసే పౌల్ట్రీ ఫారాలు ఉన్నాయి. సుమారు 3లక్షల వరకూ కోళ్లు ఉన్నట్టు తెలుస్తోంది. వేసవిలో అధిక ఉష్ణోగ్రతను తట్టుకోలేక చాలాచోట్ల గుడ్లు పెట్టే కోళ్లు చనిపోయాయి. దీనికితోడు అమెరికా వంటి దేశాల్లో కోడిగుడ్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో రైతు వద్దే గుడ్డు ధర రూ.5.90కు ఎగబాకింది. కానీ గత పదిరోజులుగా దీని ధర పతనమై.. ప్రస్తుతం రూ.4.90 చేరుకుంది. మన జిల్లాలో ఉత్పత్తయ్యే గుడ్లు ఎక్కువగా ఒడిశాకు ఎగుమతి అయ్యేవి. కాగా.. ఇటీవల ఒడిశాలో గుడ్లు పెట్టే పౌల్ట్రీఫారాలు పెరగడంతో ఇక్కడ నుంచి గుడ్ల ఎగుమతులు (మిగతా 6వ పేజీలో..)

● **దళారులకు మేలు**


బహిరంగ మార్కెట్‌లో మాత్రం కోడిగుడ్ల ధర తగ్గలేదు. రిటైల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు రూ.7 పలుకుతోంది. హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.6.50 వరకూ విక్రయిస్తున్నారు. అంటే రైతుకు, వినియోగదారుడికి మధ్య రూపాయి నుంచి రూ.1.60 ఉందన్న మాట. అన్ని కష్టాలు, వ్యయప్రయాసలు పడి రైతు పెంచి కోడిగుడ్డును ఉత్పత్తి చేస్తే.. ట్రేడింగ్ కంపెనీలు, ఏజెంట్లు, దళారులు దోచుకుంటున్నారు. వాస్తవానికి జిల్లాలో కోళ్ల ఫారాలతో పేరుమోసిన కంపెనీలు ఒప్పందాలు చేసుకుంటున్నాయి. కోడిపిల్లలు, దాణా సదరు కంపెనీలే అందిస్తున్నాయి. ఫారాల నిర్వహణ మాత్రం రైతులు చూసుకోవాలి. సాధారణ బ్రాయిలర్ కోళ్ల విషయంలో ఎప్పటికప్పుడు సమయానుకూలంగా వెళ్లిపోతుంటాయి. కానీ గుడ్లు పెట్టే కోళ్ల విషయంలో మాత్రం చాలా సమయం ఉంచాలి. ఏమాత్రం ధర హెచ్చు తగ్గులు వచ్చినా రైతులు నష్టపోక తప్పదు. అందుకే కూటమి ప్రభుత్వం స్పందించి రాయితీలు కల్పించాలని పౌల్ట్రీఫారాల రైతులు కోరుతున్నారు.

సంక్షోభంలో పరిశ్రమలు



ప్రస్తుతం పౌల్ట్రీ పరిశ్రమలు సంక్షోభంలో ఉన్నాయి. వ్యాధులతో కోళ్లు చనిపోతున్నాయి. ధర స్థిరీకరణ కూడా లేదు. ట్రేడర్లు ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తున్నారు. ప్రస్తుతం కోడిగుడ్ల ధర బహిరంగ మార్కెట్‌లో బాగుండగా.. రైతుల వద్ద మాత్రం తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. రోజుకు రూ.30వేల వరకు నష్టం వాటిల్లితోంది. రాష్ట్ర ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

- కొవ్వూరు కృష్ణారెడ్డి, అయ్యప్ప పౌల్ట్రీఫారం నిర్వాహకుడు, రణస్థలం



కమ్మసిగడాం వద్ద ఉన్న పౌల్ట్రీ పరిశ్రమ

ప్రకృతికి రక్షణ కవచం.. ఓజోన్

- పర్యావరణ హిత కార్యక్రమాలతోనే పరిరక్షణ
- నేడు అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినం

ఒకే ఊరు.. రెండు పంచాయతీలు

- ఇదీ గార మండలంలోని శిలగాం ప్రత్యేకత

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

6లో



కర్తలి వద్ద గోతుల మయమైన అంపురం- ఘాటి రహదారి

● అంపురం- ఘాటి రహదారి నిర్మాణానికి ఈ ఏడాది ఫిబ్రవరి 23న కేంద్ర ప్రభుత్వం సీఆర్ఐఎఫ్ నిధులు (సెంట్రల్ రోడ్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) రూ.23కోట్లు మంజూరుకు ఉత్తర్వులు జారీచేసింది. దీంతో రహదారి నిర్మాణం జరిగి, తమ ఇబ్బందులు తొలగిపోతాయని ఈ ప్రాంతవాసులు భావించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ (డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు)ను కేంద్రానికి ఇప్పటివరకూ పంపించకపోవడంతో నిధులు విడుదల కాలేదు. దీంతో రోడ్డు నిర్మాణ పనులు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి.

జీవో సరే.. నిధులేవీ?

- అంపురం-ఘాటి రహదారికి విడుదలకాని డబ్బులు
- తాత్కాలిక మరమ్మతుల పేరిట ప్రజాధనం వృథా

కంచిలి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కంచిలి మండలం అంపురం నుంచి ఘాటి రహదారి నిర్మాణానికి నిధులు మంజూరులో జాప్యమవుతోంది. సుమారు ఏడు నెలల కిందట ఉత్తర్వులు జారీ చేసినా ఇంతవరకూ నిధులు మంజూరు కాకపోవడంతో రహదారి పనులు చేపట్టడం లేదు. తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టినా.. నిధులు వృథా అవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే అంపురం నుంచి ఘాటి వరకు సుమారు 11 కిలోమీటర్ల ప్రధాన రహదారి పూర్తిగా గోతులమయమైంది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నిత్యం ఏదో ఒకచోట వాహనాలు అదుపుతప్పి, ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ రహదారి మీదుగా (మిగతా 6వ పేజీలో..)



కేఎఫ్‌సీలో తనిఖీ చేస్తున్న ఫుడ్ కంట్రోలర్ ఈశ్వరి

కుళ్లిన క్యాబేజీ.. పాడైన మసాలా

- వీటితో వంటచేసి వినియోగదారులకు వడ్డింపు
- 'కేఎఫ్‌సీ' దుకాణంలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

6లో

యూటీఎఫ్ నాయకుల అరెస్టు

- పలాస-కాశీబుగ్గలో 'రణభేరి'లో భాగంగా ర్యాలీకి సన్నద్ధం
- 30 యాక్ట్ అమలు నేపథ్యంలో అడ్డుకున్న పోలీసులు

8లో



యూటీఎఫ్ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కొండకుంకాంలో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు

- శివాలయం పనుల పేరిట తరలింపు
- అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

7లో

భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే బాధ్యత మీదే..

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
- కొత్త ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు

ప్రకృతికి రక్షణ కవచం.. ఓజోన్

● పర్యావరణ హిత కార్యక్రమాలతోనే పరిరక్షణ

● నేడు అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినం



నరసన్నపేట/హిరమండలం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మానవులు తమ చర్యల వల్ల ప్రకృతి విధ్వంసానికి కారణమవుతున్నారు. ఈ క్రమంలోనే సూర్యుని నుంచి వచ్చే అతినీల లోహిత కిరణాల నుంచి భూమిని రక్షిస్తున్న ఓజోన్ పొరపై పరోక్షంగా దాడిచేస్తూ... దాని ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నారు. చివరికి తమ మనుగడకు ముప్పును కొని తెచ్చుకుంటున్నారు. భూమిపై గల వాతావరణ పొరల్లో స్ట్రాటో స్పియర్‌లో వాయురూపంలో విస్తరించి ఉండే ఓజోన్ పొర క్షీణత జీవజాలంపై పెను ప్రభావం చూపుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని దాని పరిరక్షణే ధ్యేయంగా ఏటా సెప్టెంబరు 16న ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం.

ఓజోన్ అంటే ...

వాతావరణ పొరల్లో ఓజోన్ అనేది 16 నుంచి 55 కి.మీ. మేర విస్తరించి ఉన్న స్ట్రాటోస్పియర్‌లో ఉంటుంది. భూమి చుట్టూ ఆవరించి ఉండే మొదటి పొర ట్రోపోస్పియర్లోని ఆక్సిజన్ అణువులు రూపాంతరం చెంది స్ట్రాటోస్పియర్లో ఓ3 అణువులుగా మారుతాయి. ఈ ఓ 3ని ఓజోన్ వాయువుగా వ్యవహరిస్తారు. ఈ అణువలన్నీ ఓజోన్ పొరగా ఏర్పడతాయి. సూర్యుడి నుంచి అచ్చే అతినీలలోహిత కిరణాలు భూమిపైకి చేరకుండా అడ్డుకుంటాయి. ఈవిధంగా భూమిపై ఉన్న జీవజాలానికి ఎలాంటి నష్టం కలుగకుండా రక్షణ కవచంలా ఓజోన్ పొర ఉంటుంది. అయితే మానవుడి అనాలోచిత చర్యలతో ఓజోన్ పొరకు రంధ్రాలు ఏర్పడుతుండడం కలవరపాటుకు గురిచేస్తోంది.



సమస్యకు ప్రధాన కారణాలివే ...

ఓజోన్ పొర బలహీన పడడానికి ప్రధాన కారణంగా క్లోరోఫ్లోరో కార్బన్లు (సీఎఫ్‌సీ) నిలుస్తున్నాయి. వీటి వల్ల మానవాళికే కాకుండా సమస్త జీవరాసులపైనా తీవ్ర ప్రభావం పడుతోంది. రిఫ్రిజిరేటర్లు ఏసీలు వంటి వాటిల్లో వినియోగిస్తున్న సీఎఫ్‌సీలు, హైడ్రో సీఎఫ్‌సీలు వాతావరణంలో పేరుకుపోయి... స్ట్రాటోస్పియర్‌లో గల ఓజోన్‌తో చర్య పొంది అణువులను విడగొట్టి ఆక్సిజన్‌లా మారుస్తున్నాయి. ఓ 3 అణువులు ఓ 2 వాయువుగా మారుతుండడంతో ఓజోన్ పొర పలుచబడుతోంది. పంటపై చల్లే స్ప్రే, ఫోమ్, డిటర్జెంట్లు, ప్లాస్టిక్ వస్తువుల తయారీ, రిఫ్రిజరేటర్ వంటి వాటి వినియోగంతో క్లోరోఫ్లోరో కార్బన్లు వాతావరణంలోకి విడుదలవుతునాన్నయి. అదే విధంగా బ్రోమిన్ సైతం ఓజోన్ పొరను ఛిద్రం చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తోంది. నైట్రిక్ ఆక్సైడ్ (ఎన్‌వో), టెట్రాక్లోరో మీథేన్, మిథైల్ బ్రోమైడ్ (సీసీఎల్ 4, సీహెచ్3 బీఆర్)లను కూడా ఓజన్ ఈటర్స్‌గా పిలుస్తున్నారు.

వాయువులు	పారిశ్రామిక ప్రాంతం	నివాస ప్రాంతం
గాలి రేణువులు	500 పీపీఎం	200పీపీఎం
సల్ఫర్‌డైయాక్సైడ్	120 పీపీఎం	80పీపీఎం
నైట్రోజన్‌డైయాక్సైడ్	120 పీపీఎం	80పీపీఎం
కార్బన్‌మోనాక్సైడ్	0.15-1 పీపీఎం	1.5-5 పీపీఎం

వాయువుల్లో పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్) ఇలా...

ఇంతకన్నా ఎక్కువ ఉంటే ప్రమాదకర స్థాయిగా గుర్తించాలి

వాహనాల ద్వారా నష్టం ఇలా...

జిల్లాలో సుమారు 3.50 లక్షల ద్విచక్ర వాహనాలు, 17వేల మూడు చక్రాల వాహనాలు, 12వేలకు పైగా నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయి. ఎక్కువగా వాహనాల నుంచి పొగ రూపంలో కాలుష్యం వెదజల్లుతున్నాయి. ఒక లీటరు చమురు నుంచి 2.30 కిలోల విషవాయువు వస్తుంది. ఈ లెక్కన జిల్లాలో వినయోగిస్తున్న వా హనాల నుంచి వెలువడుతున్న కాలుష్యం ఏమేరకు ఉంటుందో... ఏస్థాయిలో ప్రభావం చూపుతుందో ఊహించవచ్చు.

ప్లాస్టిక్‌ను మండిస్తే ఇబ్బందే

ఒక్కో కుటుంబం వారానికి సగటున ఎనిమిది ప్లాస్టిక్ సంచులను, కనీసం 8 ప్లాస్టిక్ సీసాలను ఉపయోగిస్తోంది. సాధారణంగా 5 ప్లాస్టిక్ కవర్లలో ఒక కిలో అత్యంత భయంకరమైన విషవాయువులు, రెండు ప్లాస్టిక్ సీసాల ద్వారా కిలో కార్బన్ డైయాక్సైడ్ విడుదల అవుతాయి. తద్వారా జిల్లాలో సుమారు లక్షల కిలోల విషవాయువులను ఉత్పత్తి చేస్తున్నట్లు అంచనా. ప్లాస్టిక్‌ను మండిస్తే ఓజోన్‌ను హరించే భయంకరమైన వాయువులు విడుదలవుతాయి.

పరిశ్రమలతోనూ ఇబ్బందే...

ఓజోన్ పొరకు హాని చేసే కీలకమైన కార్బన్ వాతావరణంలో మోతాదుకు మించే కలుస్తోంది. పరిశ్రమల నుంచి విడుదలయ్యే వాయువుల్లో ప్రతి ఘనపు మీటరుకు 500 కంటే ఎక్కువ కార్బన్ రేణువులు మించకూడదు. కానీ ప్రస్తుతం జిల్లాలో భారీ, చిన్న పరిశ్రమలు విడుదల చేస్తున్న విష వాయువులు అంతకంటే ఎక్కువ మోతాదులోనే గాలిలో కలుస్తున్నాయనేది నిపుణుల అంచనా. వాతావరణంలో కాలుష్య స్థాయిని మించి 75 శాతం ఎక్కువగా విషవాయువులు విడుదల అవుతున్నాయి.



ఎన్నో దుష్ఫలితాలు

ఓజోన్ పొర క్షీణిస్తుండడంతో అతినీలలోహిత కిరణాలు భూమిపైకి చేరుతున్నాయి. దీంతో మనుషుల్లో చర్మ సంబంధ వ్యాధులు, రోగ నిరోధక శక్త తగ్గడం, కంటి సంబంధ వ్యాధులు, చర్మ క్యాన్సర్ బారినపడే అవకాశం ఉంది. ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు, గుండె నొప్పి, అధిక రక్తపోటు, రక్త సరఫరాలో అంతరాయం, కళ్ల మంటలు, జంతువులపై ఇవి మరింత తీవ్ర పరిణామాలు చూపుతాయి. మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ రేటు తగ్గి మొక్కల ఆహారం తయారీలో ఆటంకాలు ఏర్పడే అవకాశాలు ఉంటాయి. సముద్ర జీవజాలంపై పరోక్షంగా ఈ ప్రక్రియ ప్రభావితం చూపిస్తుందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరిగి భూమి అగ్నిగోళంగా మారడం కూడా దీని ప్రభావమేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



ఓజోన్‌ను కాపాడడానికి ఏం చేయాలంటే...

● ఓజోన్ పొర క్షీణతకు సీఎఫ్‌సీఎస్‌లు ప్రధాన కారణం కాబట్టి వీటి వాడకాన్ని నిషేధించాలి.

● సీఎఫ్‌సీలకు బదులుగా హైడ్రోఫ్లోరా ఒలిఫిన్స్ (హెచ్ఎఫ్‌వో)లు వాడాలి.

● రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషన్లలో సీఎఫ్‌సీలకు బదులుగా అమ్మోనియం వాడకాన్ని ప్రోత్సహించాలి.

● క్లోరిన్ కలిగిన పురుగు మందుల వాడకాన్ని నిషేధించాలి. జీవ నియంత్రణ పద్ధతులను ప్రోత్సహించాలి.

● పరిశ్రమల పరిసరాల్లో గ్రీన్‌బెల్టును అభివృద్ధి చేయాలి. విడుదలయ్యే విష వాయువుల తీవ్రతను తగ్గించి వదలాలి.

ప్రజల్లో అవగాహన కల్పించాలి



పర్యావరణ పరిరక్షణకు ఓజోన్ ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది. ఓజన్ పొర రక్షణకు పాఠశాల స్థాయి నుంచి అవగాహన కల్పించాలి. సీఎఫ్‌సీ బదులుగా అమ్మోనియం వాడకాన్ని ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్లు అతిగా వినియోగించడం వల్ల కలిగే అనర్థాలపైనా అవగాహన కల్పించాలి.

- రువ్వ తవుడు, భూగోళశాస్త్ర అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం

జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకం



ఓజోన్ పొర దెబ్బతింటే అతినీలలోహిత కిరణాలు భూమి మీదకు చేరి అనేక జీవరాశులు అంతమయ్యే అవకాశం ఉంది. జన్యుపరమైన లోపాలు ఏర్పడతాయి. ప్రకృతి ధర్మం తప్పుతుంది. మొక్కలు నాటాలి. అటవీ విస్తీర్ణం పెంచాలి.

- సీహెచ్ కృష్ణారావు, జంతుశాస్త్ర అధ్యాపకులు, నరసన్నపేట

వ్యాపారులకు 'గుడ్డు'

(ఐదో పేజీ తరువాయి)

నిలిచిపోయాయి. ఫలితంగా డిమాండ్ తగ్గి.. ధర కూడా తగ్గిందనే వాదనలు వినిపిస్తున్నాయి. గుడ్డుకు ఉండే గిరాకీ, మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొని ట్రేడర్లు ధరను నిర్ణయిస్తారు. ప్రస్తుతం పేపరు ధర ప్రకారం ఒక్కో గుడ్డు రూ.4.90 ఉంది. ఏజెంట్ కమీషన్ 25 పైసలు రైతుపైనే పడుతోంది. అంటే కేవలం రైతుకు రూ.4.65 మాత్రమే అందుతోంది. ఇంత తక్కువ ధరతో ఫారం నిర్వహణ చాలా కష్టమని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా కోళ్ల దాణా ధర భారీగా పెరిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో గుడ్డు ధర రూ.6దాటితే కానీ కోలుకోలేమని చెబుతున్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ వైష్ణవాలయాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. నారాయణ తిరుమలలో శ్రీకృష్ణుని ఊయలలో వేశారు. నానుబాల వారి వీధిలోని వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీకృష్ణ జయంతిని నిర్వహించారు.

సరుబుజ్జిలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైష్ణవ ఆలయాల్లో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో బాలకృష్ణుని విగ్రహాన్ని ఉయ్యాలలో వేసి జోలపాటలు పాడారు.

జీవో సరే.. నిధులేవీ?

(ఐదో పేజీ తరువాయి)

సుమారు 11 పంచాయతీల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కంచిలి మండలంలోని అంపురం, కర్తలి, ఎం.ఎస్.పల్లి, కొల్లూరు, ముండల, కేబీనౌగాం, ఎక్కల, బెల్లుపడ, డీజీ పురం, పోలేరు, భైరిపురం పంచాయతీల ప్రజలు ఈ రహదారి గుండా కంచిలి మండల కేంద్రానికి, సోంపేట ఇతర ప్రదేశాలకు రాకపోకలు సాగించాలంటే ఇదే ప్రధాన మార్గం. పక్కనే ఉన్న ఒడిశా ప్రాంతానికి ఇదే రహదారి వెంట వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. కాగా రహదారి ఎక్కడికక్కడ గోతులమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

● రూ.లక్షలు వెచ్చించి తాత్కాలికంగా గోతులు పూడ్చినా కొన్నిరోజుల తర్వాత పరిస్థితి షరామామూలే. గతేడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది జనవరి మధ్య అంపురం నుంచి రెండు కిలోమీటర్ల రహదారి మరమ్మతులకు రూ.8 లక్షలు కాంట్రాక్టర్‌కు చెల్లించారు. అలాగే రెండు కిలోమీటర్ల నుంచి ఆరు కిలోమీటర్ల పరిధిలోని నారాయణబట్టి వరకు మరమ్మతులకు మరో రూ.25 లక్షలు మంజూరు చేశారు. కాగా మొదటి రెండు కిలోమీటర్ల మరమ్మతులను సంబంధిత కాంట్రాక్టర్ పూర్తి చేయకపోవడంతో నిధులు విడుదల చేయలేదు. రెండో దశ పనులకు బిల్లులు చెల్లించారు. ఆయా పనులు జరిగిన నాలుగు నెలలకే రోడ్డు మళ్లీ యథాస్థితికి వచ్చి గోతులమయం కావడం గమనార్హం. రహదారి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాత్కాలిక మరమ్మతుల కారణంగా నిధులు వృథా అవుతున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

● ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈఈ(సోంపేట) దిక్కల విక్రం వద్ద ప్రస్తావించగా.. 'అంపురం - ఘాటీ రహదారి నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. మరమ్మతులకు సంబంధించి సగం పనులు పూర్తయ్యాయ'ని తెలిపారు.

కుళ్లిన క్యాబేజీ.. పాడైన మసాలా

● వీటితో వంటచేసి వినియోగదారులకు వడ్డింపు

● 'కేఎఫ్‌సీ' దుకాణంలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

అరసవల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామలక్ష్మణ జంక్షన్ వద్ద గల కేఎఫ్‌సీ పేరిట ఉన్న ఫుడ్ సెంటర్‌లో సోమవారం జిల్లా ఆహార నియంత్రణ అధికారి తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ అమ్ముతున్న ఆహార పదార్థాల విషయంలో అనేకమంది నుంచి ఫిర్యాదులు అందడంతో ఫుడ్ కంట్రోలర్ ఎస్.ఈశ్వరి తన సిబ్బందితో సోమవారం సాయంత్రం ఆకస్మికంగా వెళ్లారు. రిఫ్రిజిరేటర్‌లో కుళ్లిపోయిన కూరగాయలు (క్యాబేజీ దుర్వాసన వస్తోంది.), పాడైపోయిన మసాలా మిక్స్, ఛీజ్ బయటపడడంతో వెంటనే వాటిని స్వాధీనం చేసుకున్నారు. మసాలా వాడకం గడువు దాటి ఉండడాన్ని గమనించారు. ఈ సందర్భంగా ఈశ్వరి మీడియాతో మాట్లాడుతూ తమ తనిఖీల్లో పాడైపోయిన పదార్థాలు లభించాయని తెలిపారు. తదుపరి చర్యల కోసం పూర్తి నివేదికను జాయింట్ కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. ప్రజలు ఆహార పదార్థాలను కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, పదార్థాల నాణ్యత విషయంలో అనుమానం తలెత్తినా, ఆహారం తీసుకున్న తరువాత అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారి లక్ష్మి, సిబ్బంది ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.



నిర్వాహకులను ప్రశ్నిస్తున్న అధికారులు

లక్ష్యాలను చేరుకోవాలి.. ప్రగతి సాధించాలి

(ఐదో పేజీ తరువాయి)

కాకపోవడం. పశువులకు మేత కొరత, చేపల నిల్వ, రవాణా సదుపాయాలు తక్కువగా ఉండటం.

అవకాశాలు..

అరటి, టమాట వంటి తోట పంటలకు అధిక అవకాశాలు కల్పించాలి. రొయ్యలు, సముద్ర చేపల ఉత్పత్తి పెంపకం ద్వారా ఆదాయం పెరుగుతుంది. పాలు, కోళ్ల ఉత్పత్తి ద్వారా గ్రామీణ ఆదాయం పెంచాలి.

తీసుకోవాల్సిన తక్షణ చర్యలు

రైతులందరూ పంటల నమోదు పూర్తి చేసి పంట దిగుబడిని నమోదు చేయాలి. టమాట, అరటి పంటలకు నీటి(బిందు సేద్యం) పద్ధతి వినియోగించాలి. పంటలు, చేపలు అధికంగా లభించినప్పుడు నిల్వ లేదా ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. గణాంకాలు కచ్చితంగా నమోదు అయ్యేలా జిల్లా స్థాయిలో పర్యవేక్షణ బృందం ఏర్పాటు చేయాలి.

● పశువుల కోసం పచ్చిక దొరికేలా గడ్డి నిల్వ కేంద్రాలు పెట్టాలి. పశువులకు టీకాలు, మెరుగైన జాతుల పెంపకం చర్యలు తీసుకోవాలి. కోళ్ల పెంపకానికి శీతలీకరణ, రవాణా సౌకర్యాలు కల్పించాలి.

● పడవలు, వలలు, లోతైన సముద్ర ప్రాంతానికి వెళ్లేందుకు అవసరమైన పరికరాలు సమకూర్చాలి. రొయ్యలు, చేపల కోసం చల్లని నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. చిన్న ప్యాకెట్లు తయారీ సదుపాయాలు కల్పించాలి. రొయ్యల పెంపక కేంద్రాలు పద్ధతిగా నమోదు చేసుకోవాలి.

● చిన్నస్థాయి పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. ఆహార పదార్థాల ప్రాసెసింగ్, సముద్ర ఆహార పదార్థాల తయారీ యూనిట్లు ఏర్పాటు చేయాలి. గనులు, రాళ్ల తవ్వకం నియంత్రణతో సాగించాలి.

● స్థానిక వ్యాపారం, రవాణా, గిడ్డంగులు, హోటళ్లను అభివృద్ధి చేయాలి. గ్రామ, మండల కార్యాలయాలు సమయానికి సమాచారాన్ని నమోదు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. సమావేశంలో జిల్లాకు సంబంధించి మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.

ఒకే ఊరు.. రెండు పంచాయతీలు

● ఇదీ గార మండలంలోని శిలగాం ప్రత్యేకత

గార రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జంట నగరాలు... జంట పట్టణాల పేర్లు వినే ఉంటారు. గార మండలంలోని శిలగాం గ్రామానికి ఒక ప్రత్యేకత ఉంది. ఈ గ్రామం పాలనాపరంగా రెండు పంచాయతీలకు సంబంధించినది. గ్రామ పంచాయతీల మధ్య కొంత స్థలమైనా సరిహద్దుగా ఉంటుంది. కానీ ఇక్కడ అదేమీ లేదు. గ్రామానికి మధ్యలో ఉన్న రోడ్డే సరిహద్దు. గ్రామ ప్రవేశద్వారం వద్ద ఉన్న సిమెంట్ రోడ్డుకు తూర్పు వైపున వీధి కళింగపట్నం పంచాయతీలో ఉండగా... పడమర వైపున ఉన్న వీధి వమరవల్లి పంచాయతీలో ఉంది. ఈ గ్రామంలో సుమారుగా 100 కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడి ప్రజలందరూ కలసికట్టుగా ఉంటారు. ఒకే మాట కు కట్టుబడి ఉంటూ.. పంచాయతీలతో సంబంధం లేకుండా సంబరాలు, పండుగలూ స్వతంత్రంగా నిర్వహించుకుంటుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే బయటి వ్యక్తులు వస్తే ఈ గ్రామం రెండు పంచాయతీల నడుమ ఉందని చెబితే తప్ప తెలియదు. అంత వరకు అంతా బాగున్నప్పటికీ.. రెండు పంచాయతీలకు శివారున ఈ గ్రామం ఉండటంతో ఏమాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సుమారుగా 200కు పైగా ఓటర్లు ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులెవరూ తమ గ్రామ అభివృద్ధికి సహకరించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో తమ గ్రామాన్ని ఏదో ఒక పంచాయతీలో విలీనం చేయాలని వారు అధికారులను కోరుతున్నారు.



రెండు పంచాయతీలకు సరిహద్దుగా ఉన్న సీసీ రోడ్డు

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

● జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అర్జీలను సత్వరమే పరిష్క రించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశిం చారు. జడ్పీ సమావేశ మం దిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక (మీకోసం)లో సోమవా రం ఆయన జిల్లా నలుమూ లల నుంచి వచ్చిన వారి నుం చి 81 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ నిర్ల క్ష్యానికి తావు లేకుండా, అర్జీదారులతో మా ట్లాడి వారు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని అధికారులను9 ఆదేశించారు. ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి, జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

దివ్యాంగులకు పోలీసు చేయూత

అతడో దివ్యాంగుడు. ఆమదాలవలస మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికునిగా పనిచేస్తూ విధుల్లోనే తన కాలును పోగొట్టుకున్నాడు. దివ్యాంగ పింఛను కోసం సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో జరుగుతున్న గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశాడు. గేటులోంచి బయటకు దిగేటప్పుడు ఇబ్బందులు పడుతుండగా అక్కడే ఉన్న పోలీసు ఆ దివ్యాంగునికి చేయూతనిచ్చి జాగ్రత్తగా బయటకు తీసుకువచ్చాడు. గ్రీవెన్స్‌కు వచ్చిన ఓ మహిళకు కూడా ఓ మహిళా పోలీసు సాయం అందించారు.

సువిశాల తీరం.. పర్యాటకం లేదాయె!

(ఐదో పేజీ తరువాయి)

మహేంద్రతనయా, వంశధార, నాగావళి నదీ సంగమాలు ఉన్నాయి. తీరానికి దగ్గరగా పురాణ, చారిత్రక, ఇతిహాసాలతో ప్రసిద్ధి చెందిన ఆలయాలు, పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. విదేశాల నుంచి వేలాది కిలోమీటర్లు దాటుకుంటూ సైబీరియా పక్షులు ఇక్కడకు వస్తుంటాయి. పూండి, నౌపడ ఉప్పుగల్లీలు, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో ఎర్రమట్టి దిబ్బలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. వీటిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి ఆదాయం పెరగడంతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుంది.

పట్టించుకునేవారేరీ?

టీడీపీ హయాంలో గార మండలం కళింగపట్నం బీచ్‌ను అభివృద్ధి చేశారు. భారీ ఒంటెలతో పాటు కొన్నిరకాల జంతువుల ఆకృతులను ఏర్పాటు చేశారు. పర్యాటకులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. పర్యాటక ఉత్సవాలు కూడా నిర్వహించారు. తీరం వరకూ రహదారులను సైతం ఏర్పాటు చేశారు. గతంలో ఇక్కడ రిసార్ట్ సైతం నిర్మించారు. కానీ వైసీపీ పాలనలో ఈ బీచ్ పూర్తిగా నిర్వీర్యమైంది. నిర్వహణను గాలికొదిలేసిన జగన్ సర్కారు రిసార్ట్‌లో బార్‌ను మాత్రం నడిపించింది.

● ఇచ్ఛాపురం మండలం డొంకూరు బీచ్‌కు కూతవేటు దూరంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన సోనాపూర్, గోపాల్‌పూర్ బీచ్‌లు ఉంటాయి. అక్కడ రిసార్ట్‌తోపాటు ఆహ్లాదకర నిర్మాణాలతో నిత్యం పర్యాటకుల తాకిడి ఉంటుంది. పుష్కలంగా వ్యాపారాలు జరుగుతుంటాయి. నిరుద్యోగ యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. ప్రభుత్వానికి పర్యాటక శాఖ ద్వారా ఆదాయం కూడా సమకూరుతోంది. కాగా.. జిల్లాలోని ఏ బీచ్‌లోనూ కనీస సౌకర్యాలు లేవని పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాను పర్యాటక హబ్‌గా మారుస్తామన్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రకటించినా.. ఇంతవరకూ ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పర్యాటకాభివృద్ధిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

జిల్లాలో తీర ప్రాంతాల పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించాం. ఇప్పటికే మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ఇతర ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు ఇచ్చారు. వాటిని ప్రత్యేక పరిగణగా తీసుకున్నాం. ఇచ్ఛాపురం మండలం నుంచి రణస్థలం మండలం వరకూ ఉన్న తీరంలో పర్యాటకాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ఒక నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందించాం.

- ఎన్.నారాయణరావు, జిల్లా పర్యాటకశాఖ అధికారి, శ్రీకాకుళం

డీఎస్సీ అభ్యర్థులకు కాల్‌లెటర్స్

(ఐదో పేజీ తరువాయి)

113 మంది, ఇంగ్లీష 65 మంది, హిందీ 11 మంది, తెలుగు 37, ఫిజికల్ సైన్సు 14, సోషల్ స్టడీస్ 70, ఫిజికల్ ఎడ్యుకేషన్ 81 పోస్టులకు తుది జాబితా సిద్ధం చేశారు. తుది జాబితాలో ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 19న విజయవాడలో జరిగే సమావేశానికి పేరెంట్స్‌తో సహా హాజరుకావాలని విద్యాశాఖాధికారులు ఉత్తర్వుల్లో సూచించారు.

భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే బాధ్యత మీదే..

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- కొత్త ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు



శ్రీకాకుళం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'ఉపాధ్యాయులుగా ఒక కొత్త ప్రయాణాన్ని ఆరంభించి భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే శక్తి ఇప్పుడు మీ చేతుల్లో ఉంది' అని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కొత్తగా డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించిన ఉపాధ్యాయులకు ఆయన అభినందించారు. ఈమేరకు సోషల్‌మీడియా వేదిక ద్వారా అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. 'ఈ మెగా డీఎస్సీ ఒక బలమైన నాయకత్వం ఏమి చేయగలదో... ఏమి సాధించగలదో చూపేందుకు ఒక నిదర్శనం. ఐదేళ్ల అనిశ్చితి తర్వాత కేవలం 150 రోజుల్లో మెగా డీఎస్సీని విజయవంతంగా పూర్తి చేయడమన్నది సీఎం చంద్రబాబునాయుడి దార్శనిక నాయకత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం చూపిన నిబద్ధతకు ఒక ఉదాహరణగా నిలుస్తుంది. ఇది కేవలం ఎంపిక మాత్రమే కాదు. ఇది రాష్ట్ర విద్యా భవిష్యత్‌కు ఒక కొత్త అధ్యాయం. యువతకు అండగా నిలిచిన మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. వార్షిక డీఎస్సీ ఉంటుందనే ఆయన హామీ, వేలాది మంది అభ్యర్థులకు కొత్త ఆశలు నింపింది. ఈ దఫా అవకాశం రాని అభ్య ర్థులు నిరుత్సాహపడకుండా మరింత కృషితో ప్రేరణతో ముందుకు సాగాలి. మీ సమయం వస్తుంది.. అవకాశాలు మళ్లీ తలుపుతడతాయి' అంటూ ఆయన సూచించారు.

ఎస్‌హెచ్‌జీల లావాదేవీలు సరళతరం

- ఎమ్మెల్యే కూన రవికుమార్


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'మన డబ్బులు...మన లెక్కలు' యాప్‌తో స్వయం సహాయ సంఘాల సభ్యుల లావాదేవీలు సరళతరం కానున్నాయని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నా రు. సోమవారం దూసి ఆర్‌ఎస్‌లో సెర్ప్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాలను ప్రారంభించింది సీఎం చంద్రబాబు అని అన్నారు. మహి ళలు ఆర్థిక లావాదేవీల్లో చిన్న చిన్న సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వాటిని నివారించేందుకు ప్రభుత్వం నూతనంగా ఈ యాప్ రూపొందించిందన్నారు. ప్రతి మహిళా ఒక వ్యాపారవేత్తగా ఎదగాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆకాంక్ష అన్నారు. అక్కివరంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గాలికుంటువ్యాధి టీకాలు వేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే రవికుమార్ పాల్గొన్నారు. కార్యక్రమాల్లో వెలుగు ఏపీఎం జి.నారాయణరావు, ఎంపీడీవో రోణంకి వెంకటరావు, పశు వైద్యాధికారి మెట్ట జోత్స్న, టీడీపీ మండల అధ్యక్షుడు నూకరాజు, నాయకులు బెండి రామ్మోహన్ రావు, కూన అమ్మాజీ పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతే ధ్యేయం

- ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్

లావేరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళాభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. లావేరులో సోమవారం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు 'మన డబ్బులు..మన లెక్కలు' కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోం దన్నారు. ప్రధానమంత్రి తలపెట్టిన వికసిత్ భారత్‌లో భాగంగా 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా, సీఎం తలపెట్టిన విధంగా స్వర్ణాంధ్ర సాధనకు మనందరం కలిసి పనిచేయాలన్నారు. ప్రతీ 10 సంఘాలకు ఒక నారీశక్తిని నియమించడం జరుగుతుందన్నారు. వీరంతా నారీశక్తి యాప్ ద్వారా మన డబ్బులు- మన లెక్కలు తెలియజేస్తారన్నారు. అనంతరం పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, తహసీల్దార్ జీఎల్‌వీ శ్రీనివాసరావు, ఎంపీడీవో పి.వెంకటరాజు, ఏపీఎం సుబ్బయ్యనాయుడు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్ర

ఆమదాలవలస, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వెన్నెలవలస థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుతో అభివృద్ధి జరుగుతుందని, అయితే దీనిని అడుకునేందుకు ప్రతిపక్ష పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని రిటైర్డ్ తహసీల్దార్, టీడీపీ నేత పేడాడ జనార్దనరావు అన్నారు. సోమ వారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ గిరిజనుల పేరుతో జరుగుతున్న ఆందోళనలు, ధర్నాలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కూన అప్పలనాయుడు, పూజారి బాలాజీప్రసాద్, వెంకటరావు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

సరుబుజ్జిలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో థర్మ ల్ పవర్ ప్లాంట్ పేరుతో రైతుల వద్ద నుంచి బలవంతపు భూసేకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకో వాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సంతోష్, కె.శ్రీనివాస్ గిరిజన సమాఖ్య నాయకులు సింహాచలం డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఏఐ వైఎఫ్ ప్రతినిధులు వసంత్, ధర్మారావు, పాల్గొన్నారు.

తెలుగువీరుల విగ్రహాలు పెట్టాలి


నివాళి అర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఉన్న తరహాలో అమరావతిలో తెలుగువీరుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు కోట వెంకటేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. నవ్యాంధ్ర సాంస్కృతిక చైతన్య కళా యాత్రకు సోమవారం శ్రీకాకుళం నుంచి శ్రీకారం చుట్టారు. బాపూజీ కళా మందిరం వద్ద ఉన్న ఘంటశాల విగ్ర హానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ పి.సత్య నారాయణ, కె.వేణుగోపాల్, నిక్కు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

కొండకుంకాంలో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు

- అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది


కొండకుంకాంలో గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

లావేరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొండ కుంకాం గ్రామంలో సోమవారం గ్రావెల్‌ను అక్రమంగా తవ్వకాలు చేపట్టారు. సర్వే నెంబరు-1లో 374 ఎకరాల వరకు కొండ పోరంబోకు బంజరు భూమి ఉంది. రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగికి 4-90 సెం ట్లు వరకు భూమిని డి-పట్టా ఇచ్చారు. అయితే ఆ భూమిలో గ్రావెల్ ఉండడంతో దానిని పాత కుంకాంకు చెంది న కొందరు శివాలయం పనులు, పంట కల్లాలు ఎత్తుచేయడం తదితర పనుల నిమిత్తం ట్రాక్టర్లతో తరలించారు. గ్రావెల్‌ను తవ్వకాలు చేపడుతున్నట్లు తహసీల్దార్ జీఎల్‌వీ శ్రీనివాసరావుకు సమాచారం రావడంతో ఆర్ఐ శివహారతి, రెవెన్యూ సిబ్బందిని అక్కడికి పంపించారు. వారు అక్కడికి వెళ్లే సరికే ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లను అక్కడి నుంచి అక్రమార్కులు తరలించారు. ఈ కొండ స్థలంలో ఇకపై గ్రావెల్ తవ్వకాలను చేపట్టకుండా రోడ్డు మధ్యలో గుంత ఏర్పాటు చేసినట్లు ఆర్ఐ శివహారతి తెలిపారు.

శివానీ క్యాంపస్ ఇంటర్వ్యూలో 23 మంది ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్య ప్రతినిధులు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో ఇటీవల శ్రీ స్ప్రింటమ్ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్ (హైదరాబాద్) నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 23 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం కళాశాలలో సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఎంపికైన వారికి ఐదు నెలల పాటు ఇంటర్న్‌షిప్ ఇచ్చి రూ.15 వేలు వంతున స్టయిఫండ్ చెల్లిస్తారన్నారు. ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన రూ.6 లక్షల వార్షిక వేతనంతో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగాన్ని కల్పిస్తారని ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను సుడా ఎస్‌ఈ పి.సుగుణాకరరావు, కళాశాల యాజమాన్య ప్రతినిధులు వీఎంఎం సాయినాథరెడ్డి, పి.దుర్గాప్రసాద్‌రాజు, వైస్ ప్రిన్సిపాల్ జీటీ చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

రవితేజ డెవలపర్స్ అధినేతకు బిజినెస్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సింహాచలం

అరసవల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళానికి చెందిన రవితేజ డెవలపర్స్ అధినేత, బీజేపీ నాయకుడు పోకతోట సింహాచలం ఉత్తమ బిజినెస్ అవార్డు పొందారు. హైదరాబాద్ టి.-హబ్‌లో జరిగిన కార్య క్రమంలో ఈ అవార్డును కెనడా మాజీ మంత్రి అహీర్, అర్జున అవార్డు గ్రహీత అనూప్‌కుమార్ అందజేశారు. సీఈవో విష్ణుమూర్తి, డైరెక్టర్లు ముద్దాడ సింహాచలం, జయచంద్ర, దీపక్ పాల్గొన్నారు.

ఎంవోయూ ప్రకారం వేతనాలు చెల్లించాలి

శ్రీకాకుళం రిమ్స్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రిమ్స్ కాంట్రాక్టు కార్మికులకు ఎంవోయూ ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రిమ్స్ ఎదుట సెక్యూరిటీ కార్మికులు, ఔట్ సోర్సింగ్ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వ ర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు ఎం.గోవర్ధన రావు, టి.రామా రావు, ఎం.సూర్యనారాయణ పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ గ్రీవెన్స్‌లో స్వీకరించే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదులు స్వీకరణలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

జిల్లాస్థాయి చెస్ పోటీలకు మాధవి ఎంపిక

సోంపేట రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నడుమూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని మాధవి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్ఎం మార్పు చక్రధర్ తెలిపారు. శ్రీకాకుళంలో జరిగే జిల్లా పోటీల్లో పాల్గొంటుందన్నారు. సోమవారం ఆమెను అభినందించారు.

ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలి


హోమంలో పాల్గొన్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్

జి.సిగడాం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. వాండ్రంగి కూడలి ముఖద్వారం వద్ద ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన గోమాత విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. గోమాతను దర్శించుకుంటే వెయ్యి ఆలయాలు దర్శించుకున్నంత పుణ్యం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలన్నారు. అంతకుముందు హోమం, ప్రత్యే పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, ప్రధాన కార్యదర్శి కుదిరెళ్ల బుజ్జి, పీఏసీఎస్ చైర్మన్ బెవర జగన్నాథరావు, నేతలు బాలబొమ్మ వేంకటేశ్వరరావు, కంచరాన సూరన్నాయుడు, ఎండమూరి శ్రీనివాసరావు, వీవీ గోపాలరావు పాత్రో, పలువురు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

భాషా సాహితీ శిఖరం 'రోణంకి'

ఎచ్చెర్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అధ్యాపకుడిగా, అనువాద కుడిగా, రచయితగా పేరొందిన ఆచార్య రోణంకి అప్పలస్వామి భాషా సాహితీ శిఖరమని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. బీఆర్ఏయూలో సోమవారం వర్సిటీ, చిగురుపల్లి చంద్రకళ స్మారక వేదిక ఆధ్వర్యంలో రోణంకి అప్పలస్వామి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఏయూ ఆంగ్ల విభాగం పూర్వ ఆచార్యులు డాక్టర్ వీసీ సుధీర్, ప్రముఖ శిల్పి దివిలి అప్పారావు, ప్రముఖ రచయిత అట్టాడ అప్పల నాయుడు, ప్రభాకరరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

కవిటి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఆదివారం జరిగిన జూనియర్ అథ్లెటిక్స్ జిల్లా స్థాయి పోటీల్లో ఎస్‌వీజే విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం మేనేజ్‌మెంట్ ప్రతినిధి బీవీవీ ప్రసాదరావు, ప్రిన్సిపాల్ భాస్కరరావు అభినందించారు. పరుగు పందెంలో కె.శిరీష, హై జంప్‌లో కె. వినీష, లాంగ్‌జంప్‌లో జి.శివ కాళి ద్వితీయ స్థానాలు పొందారన్నారు.రేస్ వాక్ పందెంలో ఎస్. తిరుపతి మొదటి స్థానంలో నిలిచా రన్నారు. వీరంతా ఏలూరులో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రణస్థలం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్ర వరకు విద్యుత్ సరఫరాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ యోగేశ్వరరావు పేర్కొన్నారు. విద్యుత్ లైన్లు మరమ్మతుల నేపథ్యంలో జేఆర్‌పురం అంజనేయ గుడి, మసీదు, రామతీర్థం జంక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పొందూరు/సోంపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నేతలు కోరారు. ఈ మేరకు నిరసన వారంలో భాగంగా సోమవారం పొందూరు, సోంపేట తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. ఏపీటీఎఫ్ ప్రతినిధులు జి. బీమారావు, ఎస్. చాణక్య, గార రాజేష్ పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన

గార, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక మహిళా సభ్యులకు ఆర్థిక లావాదేవీలపై 'మన డబ్బు-మన లెక్కలు' యాప్‌తో సంపూర్ణ అవగాహన కలిగి డిజిటల్ లిటరసీ పెరుగుతుందని మండల వెలుగు ఏపీఎం వి.సుజాత అన్నారు. మండల స్థాయిలో ఉత్తమ గ్రామ సంఘంగా ఎంపికైన బూరవెల్లిలో సోమవారం స్థానిక గ్రామ సచివాలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు టి.సుశీల, బూరవెల్లి గ్రామ సంఘం అధ్యక్షురాలు ఎల్.సోమేశ్వరి పాల్గొన్నారు.

యూరియా కోసం పాట్లు


బెల్లుపడ ఆర్‌ఎస్‌కే కేంద్రంలో వేచి ఉన్న మహిళా రైతులు


రావివలస ఆర్‌ఎస్‌కే వద్ద గుమిగూడిన రైతులు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): బెల్లుపడ ఆర్‌ఎస్‌కే కేంద్రం వద్ద రైతులు యూరియా కోసం పడిగాపులు కాశారు. సోమవారం ఉదయం 8గంటలకే కేంద్రం వద్దకు రైతులు చేరుకున్నా 11 గంటల వరకు సిబ్బంది రాకపోవడంతో రైతులు ఇబ్బందులుపడ్డారు. అధికారులు వచ్చి రైతులకు కూపన్లు అందజేశారు. రెండు రోజుల్లో యూరియా వస్తుందని, కూపన్లు తీసు కొస్తే యూరియా అందిస్తామని చెప్పారు. ఏవో అజయ్ మాట్లాడుతూ.. మొదటి విడతలో బెల్లుపడకు చెందిన 416 మంది రైతులకు గాను 334 మందికి 20టన్నులు యూరియా అందించామన్నారు. రెండో విడతలో మరో 189మంది రైతులకు కూపన్లు అందించామన్నారు. ఈనెల 18,19 తేదీల్లో యూరియా పంపిణీ చేస్తామన్నారు. అన్ని పంచాయితీల్లో విడతల వారీగా యూరియా అందిస్తామని చెప్పారు. ప్రతీ రైతుకు పంట పొలాలకు కావా ల్సిన యూరియా అందించడం జరుగుతుందని తెలిపారు.

ఎరువులు ఇప్పించండి

సరుబుజ్జిలి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మాకు రావాల్సిన కోటా ఎరువులు ఇవ్వకుండా ఇతర ప్రాంతాలకు ఎలా తరలిస్తున్నారని పెద్ద వెంకటాపురం, చిన వెంకటాపురం, పాలవలస, రావివలస గ్రామాల రైతులు అధికారులను ప్రశ్నించారు. ఎరువుల పంపిణీ సక్రమంగా చేపట్టడం లేదని సోమవారం రావివలస ఆర్‌ఎస్‌కే వద్ద ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయమై ఏఈవో సనపల అశోక్ వద్ద ప్రస్తావించగా ఆధార్‌కార్డు, భూమి వివరాలు, ధ్రువపత్రాలు తీసుకొని ఎరువులు పంపిణీ చేస్తామని వెల్లడించారు.

విద్యార్థులపై శ్రద్ధ వహించాలి

రణస్థలం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ చదువుతున్న విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ప్రభుత్వ వసతి గృహాల వార్డెన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అతిథి అధ్యాపకుడి నియామకానికి దరఖాస్తులు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళా శాలలో ఒడియా అతిథి అధ్యా పకుడి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 20వ తేదీ లోగా సర్టిఫికెట్స్ కళాశాలలో అందిం చాలన్నారు. 22న ఇంట ర్వ్యూకి హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

పాఠశాలల పరిరక్షణకు 'రణభేరి'

గుజరాతీపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణతోపాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రణ భేరి నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. పలాసలో ప్రారంభమైన రణభేరి సోమవారం శ్రీకాకుళంలో ముగించా రు. కార్యక్రమంలో ఎల్. బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, సీహెచ్ రవీంద్ర పాల్గొన్నారు.

సీఎం సదస్సును వీక్షించిన అధికారులు

కంచిలి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కంచిలి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి నుంచి వినతులు స్వీకరించారు. ఇదిలా ఉండగా అమరావతిలో సీఎం చంద్రబాబు నిర్వహించిన కలెక్టర్ల సదస్సును వీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.రమేష్‌కుమార్, ఎంపీడీవో వి. తిరుమలరావు, ఎంఈవో శివరాంప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్ రావు, పశు వైద్యాధికారి శిరీష పాల్గొన్నారు.

రైతులకు సరిపడా ఎరువులు అందించాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా ఎరువులు అందించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జడ్పీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎరువులు లభ్యం కాక రైతులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లాలో ఎదలు వేసే కాలంలో వర్షాభావ పరిస్థితుల వల్ల బూస్టర్ డోస్ ఎరువు పడలేదని, ఆ తర్వాత అకాల వర్షాలు పడినా కొత్త వంగడాలకు సరిపడా యూరియా లభించలేదన్నారు. ప్రభుత్వం స్పందించి ఎరువులను సరఫరా చేయాలని కోరారు. అనంతరం గ్రీవెన్స్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షురా లు కేవీఎల్ఎస్ ఈశ్వరి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి కిరణ్‌కుమార్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తెంబూరు మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.


యూరియా పంపిణీపై అపోహలొద్దు

పొందూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూరియా సరఫరాపై రైతులు ఎలాంటి అపో హలు పెట్టుకోవద్దని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. సకాలంలో రైతు లకు ఎరువులు అందించేందుకు సీఎం చంద్ర బాబు చర్యలు తీసుకున్నారన్నారు. ఎరువులపై వైసీపీ రచ్చచేస్తూ రైతులను రెచ్చ గొట్టేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. పట్టణంలో ఇటీవల మృతిచెందిన పలువురు టీడీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శిం చారు. కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు సీహెచ్ రామ్మోహన్, అనకాపల్లి చిన రంగ, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

39 టన్నుల ఎరువుల పంపిణీ

సోంపేట రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాళ్లభద్ర, గొల్లూరు, కొర్లాం, రుషికుద్ద, మూల గోవిందపురం గ్రామాల్లో 39 టన్నుల యూరియాను రైతు సేవా కేంద్రాల్లో సోమవారం పంపిణీ చేశారు. డీసీఎంఎస్, పీఏసీఎస్‌ల అధికారులు, తహసీల్దార్ బి.అప్పలస్వామి, ఏడీఏ టి.భవానీ శంకర రావు, వ్యవసాయాధికారి బి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఎరువులను రైతులకు అందించారు.

'మోక్షగుండం'ను ఆదర్శంగా తీసుకోవాలి


మోక్షగుండం విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్‌రంగ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుని యువ ఇంజనీర్లు భవితకు బాటలు వేసుకోవాలని ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీ జీడీ బాలాజీ అన్నారు. క్యాంపస్-2లో సోమవారం ఇంజ నీర్స్ డే సందర్భంగా మోక్షగుండం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ యూని వర్సిటీ, ప్రభుత్వ పాలిటెక్నిక్, శ్రీ శివానీ, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలల్లోనూ ఇంజనీర్స్ డే నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గాంధీ స్మృతి వనంలో..

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గాంధీ మందిర స్మృతి వనంలో ప్రముఖ ఇంజ నీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని సోమవారం నిర్వహించారు. విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. లయన్స్ క్లబ్ వివిధ విభాగాల ఆధ్వర్యంలో పలువురు ఇంజనీర్లకు సత్కరించారు. అనంతరం ఎన్విరాన్మెంటల్ కమిటీ చైర్మన్ రవికుమార్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, రాజాం బ్రాంచి వారి ... శ్రీకాకుళం జిల్లా, రేగిడి/పొందూరు ... గార వీర్ S/o దుందయ్య ... గార వసంతకుమారి W/o దుందయ్య ... యిందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు-1 : శ్రీకాకుళం జిల్లా, పొందూరు సబ్.డి., ఎచ్చెర్ల మండలం, యస్.యం.పురం గ్రామపంచాయితీ పరిధిలో గల సర్వే నెం. 4-5, 4-6, 4-7, 4-8, 4-9, 4-12, 4-13, 4-14 శాండిల్ విహార్ లే-అవుట్‌లో గల ప్లాట్‌నెం. 278 గల తూ॥పలకు 50అ॥, ఉ॥దు॥లకు18అ॥ మొత్తం 100చ॥గ॥ గల భాగ్యనమునకు హద్దులు: ఉ: ప్లాట్‌నెం.281వ, ద: 30అ. వెడల్పు గల లే-అవుట్ రోడ్డు, తూ: ప్లాట్‌నెం. 279, ప: ప్లాట్‌నెం. 277.

షెడ్యూలు-2 : శ్రీకాకుళం జిల్లా, పొందూరు సబ్.డి., ఎచ్చెర్ల మండలం, యస్.యం.పురం గ్రామపంచాయితీ పరిధిలో గల సర్వేనెం. 4-15, 12-11లో "శాండిల్ విహార్ లే-అవుట్‌లో" గల ప్లాట్‌నెం. 64వ గల తూ॥పలకు 18అ॥, ఉ॥దు॥లకు50అ॥ మొత్తం 100చ॥గ॥ గల భాగ్యనమునకు హద్దులు: ఉ: ప్లాట్‌నెం.63వ, ద: ప్లాట్‌నెం.65వ, తూ: 30అ. వెడల్పు గల లే-అవుట్ రోడ్డు, ప: ప్లాట్‌నెం. 45.

R.E.Ch. Jayadev, M.A.,M.A.,B.L.,
Bank Panel Advocate, Rajam
Cell:9441116135, 9885206325

బహిరంగ ప్రకటన

నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సోంపేట బ్రాంచి వారి ... శ్రీకాకుళం జిల్లా, కంచిలి మండలం, రుషికుద్ద గ్రామ కాపురస్థులైన శ్రీ దున్న బాబూరావు S/o వాసుదేవ్ ... యిందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు : శ్రీకాకుళం జిల్లా, కంచిలి మండలం, రిషికుద్ద గ్రామ పరిధిలో గల సర్వేనెం. 205/11లో తూ॥ప॥లకు 39అ॥, ఉ॥ద॥లకు37.5అ॥ మొత్తం162.5చ॥గ॥ భాగ్యస్థలంకు హద్దులు: తూ: గొర్లి ద: గుడియా రఘునాథ భాగ్యస్థలం, ప: రోడ్డు, ఉ: పిన్నింటి కళావతి కొబ్బరితోట.

Yavvari Hema kumar
Advocate, Palasa. Cell:9440592204

బహిరంగ ప్రకటన

నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సోంపేట బ్రాంచి వారి ... శ్రీకాకుళం జిల్లా, వజ్రపుకొత్తూరు మండలం, మెట్టూరు గ్రామ కాపురస్థులైన శ్రీ గేదెల సాయికుమార్ S/o లక్ష్మణరావు ... యిందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు : శ్రీకాకుళం జిల్లా, వజ్రపుకొత్తూరు మండలం, మెట్టూరు గ్రామ పరిధిలో గల సర్వేనెం. 46-2లో తూ॥ప॥లకు 10.5అ॥, ఉ॥ద॥లకు30అ॥ మొత్తం 315చ॥గ॥ దాబాయింటికి హద్దులు: తూ: గేదెల కామరాజు వా॥ దాబాయిల్లు, ద: సి.సి.రోడ్డు, ప: గువ్వాడ వేణునాథం వా॥ దాబాయిల్లు, ఉ: సి.సి.రోడ్డు.

Yavvari Hema kumar
Advocate, Palasa. Cell:9440592204

Andhra Pradesh State Financial Corporation
(Incorporated under the State Financial Corporation Act, LXIII of 1951)
CFC-2, Industrial Area, A.P.I.I.C,Kusalapuram, SRIKAKULAM - 532005
PHONE No. 08942-295973

PUBLIC NOTICE

The general public / Financial Institutions / Banks are hereby informed by M/s. A.P. State Financial Corporation (A.P.S.F.C), that, our Corporation has sanctioned **Term Loan of Rs.125.00 lakhs (Rupees One Hundred and Twenty Five Lakhs only)** to M/s. Sri Venkateswara Modern Rice Industry, Sy.No.36/3, Gurandi (Village and Panchyat), Kottur (Mandal), Srikakulam District - 532456, to setting up a 6 TPH Rice Mill against the following Primary/ collateral Security property.

It is informed to us that the Scheduled property is owned and possessed by **Proprietor: Sri Burada Venkata Rao S/o. Yerukunaidu D.No.2-18, Kapu Street, Pathapadu (V), Nivagam, Pathapadu, Srikakulam- 532457,** agreed to mortgage below scheduled property as Primary/ Collateral security by way of Memorandum of deposit of title deeds i.e., by depositing originals of Regd. Settlement Deed dated Dt.12.09.2024, Doc No. 3991 of 2024, with SRO Hiramandalam along with link documents and supporting documents (Borrower/Surety) in favor of **A.P.S.F.C. for the loan to be sanctioned to M/s. Sri Venkateswara Modern Rice Industry,**

Hence the general public is hereby informed to file objections, claims, interest and rights or titles if any what so ever in respect of scheduled property for this proposed mortgage, with documentary proof / evidences in writing to the undersigned within Seven days from the date of this notification. Otherwise this property is taken as mortgage as clear title and subsequent objections will not be entertained and not binding on the Corporation thereafter.

SCHEDULE OF THE PROPERTY's

Primary Security, Surety : **SRI BURADA VENKATA RAO**

Freehold interest in Land admeasuring Ac. 0.92 cents or 4452.8 Sq.yards covered by Sy.No.36-3 of Gurandi (V & P), Kotturu (M), SRO Hiramandalam, Srikakulam District together with buildings constructed /to be constructed thereon bounded by **East:** Palavalasa Ramu and etc., **West:** Burada Adinarayana, Burada Krishamurthy and etc., **North. :** Anguru-kaligam Road, **South:** Munjeti Mohanrao and etc.,

Date : **15.09.2025.**
Place : Srikakulam

BRANCH MANAGER
A.P. STATE FINANCIAL CORPORATION

సమీకృత గిరిజనాభివృద్ధి, సీతంపేట
టెండరు ప్రకటన

ఆర్.సి.నెం.27/టి.డబ్ల్యూ/జి.సెల్/2025 తేది. 15.09.2025

సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, సీతంపేట వారి ఆధ్వర్యములో నడపబడుచున్న గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలలు, ఏకలవ్య పాఠశాలలు మరియు మినిగురుకుల విద్యాలయాలకు చెందిన (12) వసతి గృహములకు 2025-26 విద్యా సంవత్సరమునకు మరియు తదుపరి టెండరను ఖరారు అయినంత వరకు కూరగాయలు, చికెన్ (స్కిన్ లెస్), మరియు పండ్లు, సరఫరా చేయు నిమిత్తం సీలు వేసిన టెండరు ధరఖాస్తులు కోరబడుచున్నవి.

ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు & కళాశాలలు (బాలురు/బాలికలు), పెద్దమడి, సీతంపేట, మల్లి & మినిగురుకుల విద్యాలయాలు (సీతంపేట, కారిగూడ) & ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలు (ఇఎంఆర్ఎస్ భామిని & ఇఎంఆర్ఆర్ మెళియాపుట్టి)

ధరావత్తు సొమ్ము సంబంధిత పాఠశాల/కళాశాల పేరు మీద చెల్లుబాటు అగునట్లు డిడి రూపంలో టెండరు షెడ్యూల్‌కు జతపరచవలెను. ధరావత్తు లేని టెండరు షెడ్యూల్ తిరస్కరించబడును.

టెండరు షెడ్యూళ్ళును తేది. 18.09.2025 నుండి 25.09.2025 వరకు కూరగాయలు, చికెన్, మరియు పండ్లు, టెండరు షెడ్యూళ్ళును రూ.500/- నగదు చెల్లించి టెండరు షెడ్యూళ్ళును సంబంధిత పాఠశాల/కళాశాలలో పొందవలెను. ధరావత్తు పైకం డి.డి. రూపంలో జతపర్చి సీలువేసిన టెండరు షెడ్యూళ్ళును తేది. 25.09.2025 సాయంత్రం 04.00 గంటలు లోగ గురుకులం సెల్, ఐ.టి.డి.ఎ, సీతంపేట నందు టెండర్ బాక్స్‌లో వేయవలెను. తేది. 26.09.2025, ఉదయం 10.00గంలకు ఐ.టి.డి.ఎ,సీతంపేట నందు శ్రీ ప్రాజెక్ట్ అధికారి వారు ఆమోదించిన కమిటీ సమక్షంలో టెండర్లను తెరువబడి ఖరారు చేయబడును. టెండర్లు రద్దు చేయుటకు గాని వాయిదా వేయటకు గాని శ్రీ ప్రాజెక్ట్ అధికారి, సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, సీతంపేట వారికి సర్వాధికారములు కలవు.

ఇతర వివరములకు ప్రిన్సిపాల్ గురుకుల పాఠశాలలు/కళాశాలలు మరియు గురుకులం సెల్, ఐ.టి.డి.ఎ., సీతంపేట వారిని సంప్రదించవలెను.

సం/- శ్రీ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఐఎయస్
ప్రాజెక్ట్ అధికారి, ఐ.టి.డి.ఎ., సీతంపేట

చీకటిపడిన తర్వాత చెట్ల నరికివేత

●బాతుపురం-చినవంక రహదారిలో అనుమతి లేకుండా తొలగింపు ● చోద్యంచూస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాతుపురం- చినవంక మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్ల నిర్వహణపై పర్యవేక్షణ లేకపోవడంతో చీకటి పడిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు నరికివేస్తున్నారు. ఇక్కడి చెట్లపై పర్యవేక్షించాల్సిన ఆశాఖ అధికారులు చోద్యం చూస్తుండడంతో కొందరు వ్యక్తులు నిత్యం చీకటిపడిన తర్వాత నరికి తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా ఉండే చెట్ల తొలగింపునకు ఆశాఖ ఉన్నతాధికారుల నుంచి అనుమతిపొందాల్సిఉంది.స్థానికంగా ఎటువంటి అనుమతి లేకుండా చెట్ల నరికివేస్తుండడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కాగా చెట్ల నరికివేతను పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ జేఈ జగదీష్ తెలిపారు.



ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న చెట్టును తొలగించిన దృశ్యం

నిర్వహణ లేక.. పూడిక పేరుకుపోయి

● కోటబొమ్మాళి యరకాసి చెరువు పరిసరాల్లో దుర్వాసనతో అవస్థలు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళిలోని యరకాసి చెరువు ఏళ్ల తరబడి నిర్వహణకు నోచుకోకపోవడంతో పూడిక పేరుకుపోయింది.దీంతో దుర్వాసన వెలువడుతుండడంతో గ్రామస్థులు అవస్థలకు గురవుతున్నారు. గతంలో చెరువులో వైశ్యులవీధి, కరణాలవీధి, మంగళవీధి, మెయిన్‌రోడ్డులో నివాసముంటున్న వారంతా స్నానాలతోపాటు వాడుకకోసం వినియోగించేవారు. కొత్తమ్మతల్లి ఉత్సవాలు నిర్వహించే మూడురోజులు గ్రామానికి వచ్చిన బంధువులతో పాటు, చిరు వ్యాపారులు ఇక్కడే స్నానాలు చేసేవారు.కార్తీకమాసంలో అయ్యప్ప, భవానీ దీక్షాస్వాములకు, మహిళలకు ఎంతో ఉపయోగపడేది. ప్రస్తుతం చెత్త, పూడికలు ఏళ్ల తరబడి కుళ్లడంతో స్నానాలుచేస్తే చర్మవ్యాధుల బారిన పడుతున్నామని పలువురు వాపోతున్నారు. శారదమ్మ సర్పంచ్‌గా ఉన్న సమయంలో ఈచెరువు పక్కనఉన్న వంశధార కాలువ నుంచి ఇంజన్ల ద్వారా నీటిని తోడి నింపేవారు. దీంతో వేసవిలో కూడా నీటి సమస్య ఉండేది కాదు. వైసీపీ హయాంలో చెరువు నిర్వహణపై నిర్లక్ష్యం చూపడంతో చెత్త, పూడిక పేరుకుపోవడంతో గ్రామస్థులు వినియోగానికి ముందుకొచ్చేవారు కాదు. తక్షణమే పంచాయతీ అధికారులు స్పందించి చెరువు పూడికలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



యరకాసి కోనేరులో పేరుకుపోయిన చెత్త

ఈత రాక.. బయటకు రాలేక..

● చెరువులో స్నానానికి దిగి విద్యార్థి మృతి



లోకేష్ (ఫైల్)

ఎచ్చెర్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): బడేవానిపేట గ్రామానికి చెందిన బడి లోకేష్ (16) గ్రామసమీపంలోని ఓ చెరువులో స్నానానికి దిగి ఈత రాకపోవడంతో ఆదివారం మృతిచెందాడు.గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు.. కుప్పిలి మోడల్ స్కూల్/కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న లోకేష్ ఆదివారం సెలవుకావడంతో స్నేహితులతోకలిసి ఆటాడేందుకువెళ్లాడు.ఆ తర్వాత స్నానం చేసేందుకు సమీపంలోని అమ్మ చెరువులోకి తోటి స్నేహితులతో దిగాడు. చెరువు లోపలికి వెళ్లిన లోకేష్ ఈత సరిగా రాకపోవడంతో బయటకు రాలేక మునిగిపోయి ప్రాణాలు కోల్పోయాడు.దీనిని గమనించిన స్నేహితులు సాయాన్ని అందించలేక నిస్సహాయులుగానే చూస్తూ ఉండిపోయారు. సందెయ్య, నారాయణమ్మలకు ముగ్గురు సంతానం కాగా వీరిలో లోకేష్ మొదటి కుమారుడు. గుజరాత్ రాష్ట్రం వీరావల్‌లో చేపల వేటకు వెళ్లిన తండ్రి సందెయ్యకు కుమారుడు మృతి చెందాడన్న సమాచారం అందించారు. విద్యార్థి మృతి సమాచారం తెలుసుకున్న పోలీసులు సోమవారం గ్రామాన్ని సందర్శించి, మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజనాసు పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఎస్ఐ వి.సందీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

లావేరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):మురపాక మురళీనగర్‌కు చెందిన పొట్నూరు వెంకట రత్నం (54) గడ్డి మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మామ వార్షిక కార్యక్రమం చేసే విషయంలో ఆదివారం వెంకట రత్నం, భర్త శ్రీనివాసరావు గొడవ పడ్డారు. ఈ క్రమంలో కోపం తట్టుకోలేక వ్యవసాయం కోసం తెచ్చిన గడ్డి మందును సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే ఆమెను కుటుంబ సభ్యులు 108లో శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. అక్కడ ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. అయితే మృతదేహానికి అంత్యక్రియలు గుట్టుచప్పుడు కాకుండా చేద్దామని కుటుంబ సభ్యులు భావించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అంత్యక్రియల ప్రక్రియను అడ్డుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతురాలికి భర్త, వివాహాలు అయిన కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు.

ఎమ్మెల్యే రవికుమార్‌పై కేసు కొట్టివేత

పొందూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే రవికుమార్‌తో పాటు మరో 30 మందిపై పోలీసులు పెట్టిన కేసును స్థానిక సివిల్ న్యాయాధికారి బి.జ్యోత్స్న సోమవారం కొట్టివేశారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా పెనుబర్తిలో జరిగిన వివాదంలో అప్పటి టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రవికుమార్‌తో పాటు 30 మందిపై సెక్షన్లు 148, 353, 188 కింద కేసు నమోదు చేశారు. సోమవారం వారంతా కోర్టుకు హాజరయ్యారు. వాదప్రతివాదనలు విన్న న్యాయాధికారి కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

సోంపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జింకిభద్రకు చెందిన పొందర రామారావు ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 400 కిలోల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్‌డీటీ కూర్మారావు తెలిపారు. ఈ మేరకు సమాచారం రావడంతో సోమవారం దాడి చేశామన్నారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించామన్నారు. ఆర్ఐ నిఖిల్, వీఆర్వోలు పాల్గొన్నారు.

తొమ్మిది వాహనాలు సీజ్

కొత్తూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సరైన పత్రలు లేని తొమ్మిది ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ అమీర్‌అలీ తెలిపారు. సోమవారం కర్లెంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సారా, గంజాయి వంటి మత్తుపదార్థాలకోసం సెర్చ్ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

టెక్కలి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని టెక్కలి సీఐ ఎ.విజయకుమార్ తెలిపారు సోమవారం పాతనౌపడలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగుతో అధిక లాభాలు

హరిపురం, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): డ్రాగన్ ఫ్రూట్ సాగుతో అధిక లాభా లు సాధించవచ్చని ఏపీఎం పి. కూర్మారావు తెలిపారు. సోమవారం బాహాడపల్లిలో డ్వాక్రామహిళ కర్రిపాపమ్మ సాగుచేస్తున్న తోటను పరిశీలించారు.గ్రామంలో మహిళలు నిర్వహిస్తున్న బేకరి, కామ్యా ఫ్యాక్టరీని కూడా పరిశీలించారు.కార్యక్రమంలో ముఖలింగం, ధర్మారావు పాల్గొన్నారు.

గ్రేడ్-2 జేఎల్‌ఎంలను రెగ్యులర్ చేయాలి

●సబ్‌స్టేషన్ల ఎదుట విద్యుత్ సిబ్బంది నిరసన

జలుమూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రేడు-2 జెఎల్‌ఎం లను, కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణమే రెగ్యులర్ చేయాలని విద్యుత్ సిబ్బంది డిమాండ్‌చేశారు. సోమవారం చల్లవానిపేట, సారవకోట సబ్‌స్టేషన్ల ఎదుట అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని జేఏసీ పిలుపు మేరకు 1104 యూనియన్ సభ్యులు ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1999 ఫిబ్రవరి నుంచి ఆగస్టు 2004 వరకు ఈపీఎఫ్ టు జీపీఎఫ్ వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సెక్షన్ ఏఈ ఎం.సూర్యారావు, జేఈ జ్ఞానేశ్వరి, లైనుమేన్‌లు ఎం.సంజీవి, పి.కాంతారావ పాల్గొన్నారు.

●హిరమండలం,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగులు హిరమండలంలోని సబ్‌స్టేషన్‌వద్ద నల్లబ్యాడ్జిల తో విధులకు హాజరయ్యారు.



చల్లవానిపేట సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న సిబ్బంది

పాడిపరిశ్రమ అభివృద్ధికి పెద్దపీట



పాతపట్నం: గాలికుంటువ్యాధి నివారణ టీకాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పోలాకి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పాడిపరిశ్రమ అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి తెలిపారు. సోమవారం మబగాం పశువైద్యకేంద్రంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారి బి.పద్మప్రియ, అప్పలసూరి, ఓంకార్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గాలి కుంటువ్యాధి టీకాలను వినియోగించుకోండి

పాతపట్నం, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి):గాలి కుంటువ్యాధి నివారణా టీకాలు పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు.సోమవారం పాతపట్నంలోని క్యాంపుకార్యాలయంలో జాతీయగాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమ ప్రచార గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీ ఎం.కరుణాకర్, టీడీపీనాయకులు తూలుగు తిరుపతిరావు, ఎ.మధు, పశువైద్యాధికారులు బి.శ్రీవాణి, డీపీ అనిల్, కె.మౌనిక సంచార పశువైద్యశాల వైద్యులు కిరణ్ పాల్గొన్నారు.

231 పశువులకు టీకాలు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో 12,100 గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందుబాటులో ఉన్నాయని పశువైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం నిమ్మాడ, నారాయణవలస, సింహాద్రిపురం తదితర గ్రామాల్లో తిలారు పశువైద్యాధికారి మెండ ప్రజ్ఞచైతన్య ఆధ్వర్యంలో 231 పశువులకుటీకాలు వేశారు.కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ సిబ్బంది కె.అనంతరావు, రాంబాబు, శంకర్, బాస్కరరావు, ఫణి, ప్రసాద్, రామకృష్ణ, శ్రీకర్ పాల్గొన్నారు.

యువత నైపుణ్యం పెంపొందించుకోవాలి

● నరసన్నపేట ఎమ్మెల్యే రమణమూర్తి పిలుపు

నరసన్నపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యువత నైపుణ్యం పెంపొందించుకోవాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. పనిలో నైపుణ్యం పెంచుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. సోమవారం నరసన్నపేటలో డ్రెడ్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో పారిశ్రామిక శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వీలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల విస్తరణకు రూపొందించిన ర్యాంపు పథకం ద్వారా యువతకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ జిల్లా ప్రతినిధి అరుణ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థికసాయం

మెళియాపుట్టి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):ముక్తాపురం ఫీల్డ్ అసిస్టెంట్ సవర రాజు కుటుంబానికి ఫీల్డ్ అసిస్టెంట్లు అండగా నిలిచారు. ఇటీవల సవర రాజు మృతి చెందడంతో ఫీల్ అసిసెంట్ల సంఘ అధ్యక్షుడు తిరుపతిరావు, జిల్లా కార్యదర్శి శ్రీను ఆధ్వర్యంలో రాజు కుటుంబసభ్యులకు రూ. పది వేలు అందజేశారు.

●వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి మండలంలోని జర్రిబద్ర గ్రామానికి చెందిన సిగిలిపల్లి చంద్రయ్య బ్రెయిన్‌ట్యూమర్‌తో బాధపడుతుండడంతో యువతరం సేవాసమితి అండగా నిలిచింది. ఈ మేరకు 15వేలు అందించినట్లు సేవాసమితి అధ్యక్షుడు చింత మురళి చెప్పారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

పలాస రూరల్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి):క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్‌రావు, టీడీపీ మండలాధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణకుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని బొడ్డపాడులో అండర్-14 విభాగంలో కబడ్డీ,ఖోఖో,బ్యాడ్మింటన్ మండలస్థాయి పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ తెలుగు యువత కిక్కర ఢిల్లీరావు, దుష్యంత్, కుమారరాజా, గ్రామపెద్ద తామాడ త్రిలోచనరావు, పీడీలు తవిటయ్య, పద్మలోచన పాల్గొన్నారు.

టెక్కలిలో రోణంకి అప్పలస్వామికి నివాళి

టెక్కలి,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి):టెక్కలిలోని పెన్షనర్ల సంక్షేమ సంఘ భవనంలో బహుభాషా కోవిదుడు రోణంకి అప్పలస్వామి 116వ జయంతిని సోమవారం సాహిత్య సాంస్కృతికసమాఖ్య, పెన్షనర్లసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుజ్జు వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలస్వామి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో చిగురుపల్లి చంద్రకళ స్మారక వేదిక కన్వీనర్ సీహెచ్.ప్రభాకరరావు, కేంద్ర సాహిత్యఅకాడమీ పూర్వ సలహా మండలి సభ్యులు అట్టాడ అప్పలనాయుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ గుంట లీలావర ప్రసాదరావు, రోణంకి రామచంద్రరావు, కూర్మాన ధనుంజయరావు, శిష్టు వెంకట అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

కిల్లమ్మ దేవత ఉత్సవం ప్రారంభం

మందస, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి):మందసలో కిల్లమ్మ దేవత ఉత్సవం సోమవారం ప్రారంభమైంది. రాజుల కాలం నుంచి సంప్రదాయాలు అనుసరించి నాటి నుంచి నేటి వరకూ ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పిడిమందసలో వెలసిన అమ్మవారి విగ్రహాన్ని దసరా ఉత్సవాలకు ముందుగా తీసుకువచ్చి మందస రాజు వారి కోట ఆవరణలో నిర్మించిన ప్రత్యేక గదిలో ఆశీనులు చేసి పూజలు నిర్వహిస్తారు. రైతులు పాడిపంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. అర్చకులు ధర్మారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

కల్తీ సరుకుల నిరోధానికి చర్యలు తీసుకోవాలి

టెక్కలి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కొత్తమ్మతల్లి ఉత్సవాల్లో కల్తీ సరుకుల నిరోధానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ చిట్టిబారికి లింగరాజు కోరారు. సోమవారం టెక్కలిలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు.ఉత్సవాల్లో ఫుట్‌పాత్ వ్యాపారాలు కల్తీసరుకులు తీసుకురా వడంతో పాటు, పరిశుభ్రత పాటించకుండా ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తాంటారని వివరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లుచేయాలని సూచించారు.

ఆలయాల హుండీల లెక్కింపు

జిల్లాలోని పాతపట్నంలోని నీలమణిదుర్గ, కోటబొమ్మాళిలోని కొత్తమ్మతల్లి ఆలయాల హుండీలను సోమవారం లెక్కించారు. ఈ సందర్భంగా అర్చకులు, ఆలయాలు, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

●పాతపట్నం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని నీలమణిదుర్గ ఆలయానికి 39రోజులకు రూ.3,14,385లఆదాయం లభించినట్లు ఈవో టి.వాసుదేవరావు తెలిపారు.దేవదాయశాఖ టెక్కలి గ్రూప్ ఆలయాల ఈవో టీపీ మనస్వి పర్యవేక్షణలో ధర్మహుండీలను సోమవారం లెక్కించారు. కార్యక్రమంలో అర్చకులు, వేంకటేశ్వరస్వామి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

●కోటబొమ్మాళి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళిలోని కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో గల ధర్మహుండీలు 85 రోజులకు లెక్కించారు. రూ. 4,91,802లు ఆదాయం వచ్చినట్లు ఈవో వాకచర్ల రాధాకృష్ణ సోమవారం తెలిపారు. రావివలస ఎండల మల్లికార్జున ఆలయఈవో జి.గురునాధరావు ఆధ్వర్యంలో హుండీలను లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోరాడ చిన్న గోవింద్, గ్రామపెద్దలు కోరాడ పెద్ద గోవింద్ పాల్గొన్నారు.

ఇంజనీర్లే భవిష్యత్ తరాల రూపకర్తలు

●ఘనంగా జాతీయ ఇంజనీరింగ్ దినోత్సవం ● విశ్వేశ్వరయ్యకు నివాళి

ఇంజనీర్లే భవిష్యత్ తరాల రూపకర్తలని వక్తలు పేర్కొన్నారు. సోమవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకుని జాతీయ ఇంజనీరింగ్ దినోత్సవం నిర్వహించారు.ఈసందర్భంగా విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి దేశానికి ఆయనచేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

●ఎల్.ఎన్.పేట, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి):భావితరాలకు అత్యాధునిక యంత్ర సౌకర్యాలను కల్పించి ఉజ్వల భవిష్యత్‌ను అందించినవారు ఇంజనీర్లేనని బాలల హక్కుల పరిరక్షణవేదిక జిల్లా కార్యదర్శి మన్మథకుమార్‌మిశ్రో తెలిపారు. లక్ష్మీనర్సుపేట ఆదర్శప్రాథమిక పాఠశాలలో జాతీయ ఇంజనీరింగ్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.రమాదేవి, వీఆర్వో రమణమ్మ, లక్ష్మీనారాయణ, ఎన్. రామారావు, పి. లక్ష్మణరావు పాల్గొన్నారు.

●టెక్కలి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): టెక్కలి సమీపంలో గల ఐతమ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి శ్రీకాకుళం ఐఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు, ఇన్నోవేషన్ సమ్మిట్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డాక్టర్ దినాకర్, డాక్టర్ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

●పాతపట్నం, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): పాతపట్నం ప్రభుత్వోన్నత పాఠశాలలో జాతీయ ఇంజనీరింగ్ దినోత్సవం పురస్కరించుకొని మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సనపల వైకుంఠరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధినిచూసి ఓర్వలేకే వైసీపీ తప్పుడు ప్రచారం

సంతబొమ్మాళి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసిఓర్వలేకే వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని టీడీపీ రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి దుపాన వెంటకరమణ తెలిపారు. సోమవారం సంతబొమ్మాళిలో విలేకరులతో మాట్లాడుతూ సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కావడంతో వైసీపీనాయకులకు నిద్రపట్టడం లేదన్నారు.వ్యక్తిగత తగదాను యూరియాపై పెట్టారన్నారు. తప్పుడు ప్రచారం చేస్తున్నవారిపై కేసులు నమోదు చేయాలని కోరారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ కె.కాంతరావు, టీడీపీ మండలాధ్యక్షుడు జీరుభీమరావు, పి.శ్రీనివాసరావు, రెడ్డిబోఅప్పన్న,మాజీ ఎంపీపీ విష్ణుమూ ర్తి, వసంతరావు, రమేష్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకుల అరెస్టు



కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ఆవరణలో అరెస్టయిన యూటీఎఫ్ నాయకులు

పలాస, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పలాసలో యూటీఎఫ్ నాయకులను పోలీసులు అరెస్టుచేశారు. సోమవారం పలాస ఆర్టీసీ కార్యాలయం నుంచి కాశీబుగ్గ బస్టాండ్ వరకూ రణభేరి కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేసేందుకు యుటీఎఫ్ నాయకులు పిలుపుఇచ్చారు. ఈ మేరకు యూటీఎఫ్ నాయకులు కాంప్లెక్స్‌కు చేరుకోగా కాశీబుగ్గ పోలీసులు ర్యాలీకి అనుమతి ఇవ్వలేదు. ఈ సందర్భంగా యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వరరావు ఢంకా మోగించి రణభేరి కార్యక్రమాన్ని ప్రారంభించగా, డీఎస్పీ వి.వెంకట అప్పారావు వారితో మాట్లాడారు. జంటపట్టణాల్లో 30 పోలీసు యాక్ట్ అమలులో ఉందని, ర్యాలీలు, సభలు నిర్వహించవద్దని కోరారు. తాము శాంతియుతంగా ర్యాలీ చేస్తామని అనుమతించాలని నాయకులు కోరారు. దీంతో పోలీసులు, సంఘ నాయ కుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం వెంకటేశ్వరరావుతోపాటు రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్, కోశాధికారి రెడ్డి మోహనరావు, జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు, ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తితో పాటు నాయకులందర్ని పోలీసులు కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచిక త్తుపై వారిని విడిచిపెట్టారు.కాగా అరెస్టుల ద్వారా ఉద్యమాలు ఆపలేరని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. పలాసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల రక్షణ, విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రణభేరి కార్యక్రమం చేపట్టడం తప్పా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జి.గిరిధర్, ఎల్‌వీ చలం, దమయంతి, స్వర్ణకుమారి, రవికుమార్, కోదండరావు, మధుసూదనరావు, సంజయ్‌కుమార్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

నందిగాం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. నందిగాంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రణభేరీ జాత కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయుల నుంచి సోమవారం వినతులు స్వీకరించారు.కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎన్.కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎల్.బాబూరావు, శ్రీరామ్మూర్తి, కార్యదర్శి బాలక శంకరరావు, మండలశాఖ ప్రతినిధులు కె.కుమారస్వామి, సురేష్, అప్పలస్వామి పాల్గొన్నారు.

హిందీ దివస్ వేడుకలు

హరిపురం, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి):మందస మండలంలోని జీఆర్‌పురం హైస్కూల్‌లో హెచ్‌ఎం కె.రమణమూర్తి ఆధ్వర్యంలో సోమవారం హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ భాష ప్రాధాన్యతను వివరించి ఉపాధ్యాయిని నాగశిరీషను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెంకటరావు, జయలక్ష్మి, జ్యోతి, పాపారావు, మాధవ్ పాల్గొన్నారు.

●పాతపట్నం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పాతపట్నం ప్రభుత్వోన్నతపాఠశాలలోహిందీభాషా దినోత్సవాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు, రామారావు పాల్గొన్నారు.

తెలుగు మీడియం కొనసాగించాలి

ఎల్.ఎన్.పేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు తెలుగు మాధ్యమంలో పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించడంతోపాటు తెలుగు మీడియం కొనసాగించాలని ఎస్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి డిమాండ్‌చేశారు. సోమవారం దొంకలబడవంజ, కవిటి, కొమ్ముపలస, బొడ్డవలస, ధనుకువాడ, గొట్టిపల్లి, బసవరాజుపేట, తాయిమాంబపురం పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్,ఎస్‌టీయూ నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

ఏపీఎంపై చర్య తీసుకోవాలి

కొత్తూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు ఐపీ ఏపీఎం లలితపై చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులు కోరారు. ఈమేరకు సోమవారం శ్రీకాకుళంలో జిల్లాపరిషత్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. మహిళలతో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యాలయానికి వచ్చే మహిళలను అగౌరవపరుస్తున్నారన్నారు.కార్యాలయంలో జరుగుతున్న అవకతవకలపై విచారణ నిర్వహించాలని కోరినట్లు ఎంఎంఎస్ అధ్యక్షురాలు సీతమ్మ తెలిపారు.

క్లోరినేషన్ చేపట్టాలి

నందిగాం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) బావుల్లో క్లోరినేషన్ చేపట్టాలని బీజేపీమండలాధ్యక్షుడు వై.కామరాజు కోరారు. మండలపరిషత్ పరిపాలనాధికారి పి.పార్వతీశ్వరరావు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో కె.కిషోర్‌కుమార్, రామకృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గిరిజనులకు వైద్యసేవలు

హిరమండలం, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పెద్దకిట్టలపాడు పరిధిలోగలచిప్పగూడ, అంతకాపల్లి, పూనిపేట తదితర గిరిజన గ్రామాల్లో హిరమండలం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను నిర్వహించారు.ఈ సందర్భంగా గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.సాయికుమార్, పీహెచ్‌ఎన్ ఆది లక్ష్మి,హెల్త్‌అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు.